

ఎల్‌ఓసీ అందిస్తున్న సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి

## ఎల్ ఓసీ అందజేత

మఠంపల్లి, అక్టోబర్ 12 : ఆపదలో ఉన్న వారి వైద్యానికి ఎల్‌ఓసీ అందించడం అభినందనీయమని మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. మఠంపల్లికి చెందిన మాతంగి రమేశ్ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని గురువారం లబ్ధిదారుడికి అందించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడు ఎమ్మెల్యే సైదిరెడ్డి అని కొనియాడారు. ఎల్‌ఓసీ మంజూరు చేయడంపై ఎమ్మెల్యే సైదిరెడ్డికి రమేశ్ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు కొమ్ము సైదులు, పల్లె పంగు రాధాకృష్ణ, అంజి, సతీశ్ ఉన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న బాలకృష్ణన్

## కేవీకేలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు

గరిడేపల్లి, అక్టోబర్ 12 : నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్)- హైదరాబాద్ ఆర్థిక సహకారంతో షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతులకు చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తుల తయారీపై మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగిసింది. దీంతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నారమ్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ గురువారం సర్టిఫికెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ శిక్షణతో చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులను తయారీ చేసి స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి పీసీ లవకుమార్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి, శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సీహెచ్.నరేశ్, టి.మాధురిలతో పాటు 25 మంది యువతులు పాల్గొన్నారు.

## వ్యవసాయరంగానికి స్వామినాథన్ సేవలు మరువలేనివి

- అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

బొడ్రాయిబజార్, అక్టోబర్ 12 : భారత వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎం.ఎస్.స్వామినాథన్ చేసిన సేవలు మరువలేనివని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. స్థానిక ఎంవీఎన్ భవన్‌లో గురువారం 'భారత వ్యవసాయ రంగం-స్వామినాథన్ సిఫార్సులు 'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. 2014-2018 ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దేశంలో మహిళా రైతుల అభ్యున్నతికి కుటుంబ స్త్రీ పథకం అమలు చేయాలని స్వామినాథన్ సిఫార్సు చేశారన్నారు. విత్తన ఏర్పాటు సంస్థగా భారతదేశం అభివృద్ధి కావాలని నిరంతరం అకాంక్షించారన్నారు. అంతకు ముందు స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభనాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

## దక్కన్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్యశిబిరం

పాలకవీడు, అక్టోబర్ 12 : దక్కన్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ సీజీఎం నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రివర్ ఆస్పత్రి మిర్యాలగూడ వారిచే పరిశ్రమలోని స్కూల్ ఆడిటోరియంలో ఉదయం 8.30నుంచి సాయంత్ర 3.30గంటల వరకు చర్మ, ఎముకల, గుండె సంబంధిత పరీక్షలు, బాలికల సమస్యలు, మహిళలకు ఉచితంగా పరీక్షించి అవసరమైన వారికి మందులు అందిస్తామని తెలిపారు.

# వాడవాడలా సీసీరోడ్లు

## గుర్రపుతండాలో రూ.5.20 కోట్లతో పనులు

- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొండమల్లేపల్లి, అక్టోబర్ 12 : మండలంలోని గుర్రపుతండా గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ముందంజలో ఉంది. గత పాలకులు గ్రామాన్ని పట్టించుకోక పోగా.. తండాకు వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి కూడా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పల్లెల అభివృద్ధికి అందిస్తున్న నిధులతో అభివృద్ధి పథంలో సాగుతోంది.

### గ్రామ పంచాయతీగా ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం గుర్రపుతండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు అధిక నిధులు మంజూరు చేయడంతో గ్రామ రూపురేఖలే మారిపోయాయి. ఎమ్మెల్యే రమారత్ రవీంద్రకుమార్ చొరవతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షలు అందించింది. దాంతో గ్రామంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గతంలో కనీసం తండాకు వెళ్లేందుకు కనీసం దారి కూడా లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.



గుర్రపుతండాలో నిర్మించిన మిషన్‌భగీరథ ట్యాంకు

ప్రస్తుతం ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించడంతో వీధులు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దాంతో పాటు మిషన్ భగీరథతో ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నారు.

### మౌలిక వసతుల కల్పన

రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ. రూ.5.20 కోట్లతో గ్రామంలో మౌలిక వసతులు కల్పించారు. రూ.11.02 లక్షలతో వైకుంఠధామం, రూ.2.18 లక్షలతో డంపింగ్ యార్డును నిర్మించారు. దాంతో పాటు రూ.5.52 లక్షలతో 46 ఇండ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.36.13 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించడంతో పాటు రూ.10.68 లక్షలతో మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ అందించేందుకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. రూ.3.68 లక్షలతో 140 కుటుంబాలకు నల్లా కనుక్షన్లు ఇచ్చారు. రూ.70 లక్షలతో సాగర్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి గుర్రపుతండా వరకు బీటీ రోడ్డు నిర్మించారు. రూ.8 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేసి, దాని సాయంతో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. రూ.1.80 లక్షలతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. దాంతో పాటు గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. సాగర్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి పన్నితండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి.



గుర్రపుతండాలో వేసిన సీసీ రోడ్డు

### ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నిధులతో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించినం. వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం నిర్మాణం చేపట్టడంతో పాటు పల్లె ప్రకృతి వనం ద్వారా ఆహ్లాదం అందుతున్నది. ఎస్‌డీఎఫ్, ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించినం. వంద శాతం మరుగుదొడ్లు నిర్మించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నం.

-రమావత్ అనిత, సర్పంచ్, గుర్రపుతండా

### సీసీ రోడ్ల నిర్మాణంతో ఇబ్బందులు తీరినై



మా ఊర్లో గతంలో రోడ్లు సరిగా లేక బురదతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు వాడవాడలా సీసీ రోడ్లు వేయడంతో ఇబ్బందులు తీరినై. ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. రోడ్లన్నీ శుభ్రంగా ఉండడంతో దోమల బెడద కూడా లేదు. వీధుల్లో లైట్లు వేయడంతో ఎలాంటి భయం లేకుండా బయటికి వెళ్ల గలుగుతున్నం.

-రమావత్ బిచ్చునాయక్, గుర్రపుతండా

## బండరాళ్లు మీదపడి వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, అక్టోబర్ 12 : బండరాళ్లు మీదపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని బాపూజీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొల్‌ముంతల్ పహాడ్ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ శివారులో ఉన్న స్టోన్ క్రషర్ మిల్లులో గ్రామానికి చెందిన ఆలకుంట చిన్నరాయుడు(30) పని చేస్తున్నాడు. క్రషర్‌కు చెందిన క్వారీ వద్ద కంప్రెషర్ సాయంతో బండకు హోల్ పెడుతుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న బండరాళ్లు ఒక్కసారిగా చిన్న రాయుడు మీద పడడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

## రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లను తొలగించాలి : ఎంపీడీఓ

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 12: శాసన సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లను తొలగించాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ సూచించారు. గురువారం మండలంలోని తెట్టెకుంట, అల్వాల, జానారెడ్డి కాలనీ, ఎల్లాపురం, ఎల్లాపురంతండా, తూటిపేటతండా, గాత్‌తండా గ్రామాలను సందర్శించారు. వాల్ పేయింటింగ్స్ ఉంటే చెరిపివేయించాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను ఆదేశించారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ యాదయ్య

కొండమల్లేపల్లి, అక్టోబర్ 12 : మం డంలోని కొత్తబావి గ్రామపంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ జబ్బు యాదయ్య, ఉప సర్పంచ్ ఏరుకొండ చంద్రయ్య గురువారం ఎంపీడీఓ బాలరాజురెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాద య్య మాట్లాడుతూ సర్పంచ్, ఉప సర్పంచ్‌కు తెలియకుండానే పెన్‌డ్రైవ్‌లు తీసుకెళ్లి 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకున్నాడని తెలిపారు. దాంతో పాటు అనేక పర్యాయాలు తమకు చెప్పకుండానే నిధులు డ్రా చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధుల స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై విచారణ జరిపి నిధులను రికవరీ చేయాలని, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు : ఎస్‌ఐ

కొండమల్లేపల్లి, అక్టోబర్ 12 : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున సోషల్ మీడియాలో వ్యక్తులను కించపర్చేలా, రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వీరబాబు హెచ్చరించారు. ఇలాంటి పోస్టులు పెట్టిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.